క్లుప్తంగా

నిరుపేదకు వితరణ

బలిజిపేట: అరసాడ గ్రామానికి చెందిన పి.నారాయణమ్మకు పెదపెంకి గ్రామానికి చెందిన దాతలు కొంత మొత్తాన్ని వితరణగా శనివారం అందజేశారు. నారాయణమ్మ నిరుపేద కావడంతో ఆమె నివసించేందుకు నిర్మించుకుంటున్న రేకులతో వేసిన ఇంటి నిర్మాణానికి 4 సిమెంటు బస్తాలకు చెందిన మొత్తాన్ని పెదపెంకికి చెందిన దాతలు ఆర్.మురళీ, ఈర్ల సంజీవినాయుడులు అందించారు. కార్యక్రమంలో జి.సతీష్, శ్రావణ్, ఎం.శ్రీనివాస్, బి.హర్షవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

100 మందికి వైద్య పరీక్షలు



ఉచిత వైద్య శిబిరంలో తనిఖీలు

బలిజిపేట: పెదపెంకిలో శిలువగిరి ఉత్సవం సందర్భంగా నెల్లిమర్ల మిమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో సామాజిక కార్యకర్త ఎస్.రాము ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. శిబిరంలో 100మంది ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించుకోగా 15మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేయడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. వీరిని నెల్లిమర్ల ఆస్పత్రికి తీసుకువెళ్లేందుకు సోమవారం వాహన సదుపాయాన్ని నిర్వాహకులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శస్త్ర చికిత్సలు పూర్తయిన వారిని తిరిగి పెదపెంకి తీసుకురావడం జరుగుతుందని తెలిపారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు...



పట్టణంలో నిర్వహిస్తున్న గస్తీ

సాలూరు: శాంతిభద్రలకు విఘాతం కలిగించరాదని పట్టణ ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో శుక్ర, శనివారాల్లో ప్రత్యేక పోలీస్ బలగాలతో గస్తీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చట్టాలను ఎవరు అతిక్రమించరాదని అన్నారు. పబ్లిక్ పరీక్షలు, శ్రీరామ నవమి ఉత్సవ వేడుకలు నిర్వహణ తదితర పరిణామాల నేపథ్యంలో ప్రత్యేక సూచనలు చేశారు. చట్టాలను అధిగమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్య సేవలు



రోగులను తనిఖీ చేస్తున్న డాక్టర్ ఉషారాణి

సీతానగరం: ఫ్యామిలీ డాక్టర్ విధానంలో పేదలకు ఇళ్లల్లోనే 104 సంచార వైద్య కేంద్రం ద్వారా మెరుగైన వైద్య సేవలందిస్తున్నామని సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ పి.ఉషారాణి అన్నారు. అంటిపేట, వెంకటాపురం గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. పలువురు రోగులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సిరికి మహేశ్వరరావు, 104 సిబ్బంది దుర్గాప్రసాద్, వైద్య సిబ్బంది, ఆశా సిబ్బంది పాల్గొన్నారు.

బాంబు బ్లాస్టింగ్ పనులు ఆపండి



కొండ దగ్గర జరుగుతున్న బాంబు బ్లాస్టింగ్ పనులు అడ్డుకుంటున్న కోటిపాం గ్రామస్తులు

కొమరాడ: మండలంలోని కోటిపాం గ్రామం దగ్గరున్న అతిపెద్ద రాతిని తొలగించేందుకు చేపడుతున్న బాంబు బ్లాస్టింగ్ పనులను ఆపాలని గ్రామస్తులు కోరుతున్నారు. రైల్వే మూడో లైన్ ఏర్పాటుకు అడ్డుగా ఉన్న ఇక్కడి అతిపెద్ద రాయిని బాంబు పేల్చి తీసేందుకు ప్రయత్నిస్తుండగా అక్కడి కొండపై ఉన్న వీర వేంకటసత్యనారాయణ ఆలయం బీటలు వారుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాంబులు పేల్చకుండా నెమ్మ నెమ్మదిగా రాయిని తొలగించే పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు

వంగర: మగ్గూరు రక్షిత మంచినీటి పథకం పరిధిలోని గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఏఈఎస్ రాజన్ తెలిపారు. మండల పరిధి మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్ట్‌ను ఆనుకొని మగ్గూరు వద్ద ఉన్న రక్షిత మంచినీటి పథకం హెడ్ భాగాన్ని పరిశీలించారు. వేసవిలో ప్రజలు తాగునీటికి ఎటువంటి ఇబ్బందుల్లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

జగనన్న పాలనలో
మహిళలే మహారాణులు



సీతానగరం: లచ్చయ్యపేటలో జగనన్న చిత్రపటానికి క్షీరాభిషేకం

బలిజిపేట: జగనన్న పాలనలో మహిళలే మహారాణులని ఎంపీపీ నాగమణి అన్నారు. వైఎస్సార్ ఆసరా పథకం మహిళలకు ఉపాధి అవకాశాలను కల్పిస్తుందన్నారు. వైఎస్సార్ ఆసరా పథకం నిధులు శనివారం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి విడుదల చేయగా ఇక్కడి ఆర్‌బీకేలో టీవీల ద్వారా ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళలు వీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీపీ నాగమణి మాట్లాడుతూ మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాఘలత, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, ఎంపీడీఓ భానుమూర్తి, ఏపీఎం ఉమామహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న మహిళా పక్షపాతి

సీతానగరం: రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు మహిళా పక్షపాతి అని జెడ్పీటీసీ ఎం.బాబ్జీ పేర్కొన్నారు. వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత ఆర్థిక సహాయాన్ని శనివారం విడుదల చేయగా లచ్చయ్యపేటలో సర్పంచ్ సీహెచ్ కృష్ణ ఆధ్వర్యంలో పొదుపు సంఘాల సభ్యులు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి శనివారం క్షీరాభిషేకం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్పీటీసీ బాబ్జీ మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అన్ని గ్రామాల్లో వీఓఏల ఆధ్వర్యంలో పొదుపు సంఘాల సభ్యులు సంబరాలు నిర్వహించారు. మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో వెలుగు ఏపీఎం ఆర్.శ్రీరాములు ఆధ్వర్యంలో ఆసరా ప్రారంభ కార్యక్రమాన్ని మహిళలు వీక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి శ్రీరాములు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు టి.వెంకటప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు బొన్నాడ తిరుపతిరావు, ఆర్.అచ్యుతరావు, వెలుగు సీసీలు, వీఓఏ, పొదుపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మహిళలకు తొలి ప్రాధాన్యం

సాలూరు: మహిళలు మహారాణులుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, ఏఎంసీ చైర్‌పర్సన్ దండి అనంతకుమారి అన్నారు. మండలంలోని వెలుగు కార్యాలయంలో ఏపీఎం గండిపల్లి సింహాచలం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన వైఎస్సార్ ఆసరా మూడో విడత పంపిణీ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు తన పాలనలో డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేయకుండా మోసం చేశారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా ఆదుకుంటున్నారని వివరించారు. కార్యక్రమంలో సువ్వాడ భరత్‌శ్రీనివాస్, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో..

మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శంకరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్ చైర్‌పర్సన్ జర్జాపుదీప్తి, కౌన్సిలర్లు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొని వీక్షించారు.



సీతానగరం: మండల కేంద్రంలోని ఆర్బీకేలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు



బలిజిపేట: ఆర్బీకేలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని వింటున్న ఎంపీపీ, జడ్పీటీసీ, మహిళలు



సాలూరు: వెలుగు కార్యాలయంలో ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు

సామాజిక తనిఖీలో వెలుగు చూసిన అక్రమాలు

- అధికారుల గైర్హాజరుపై డ్వామా పీడీ ఆగ్రహం

పాచిపెంట: మండలంలోని 2021 – 22, 22 – 23 ఆర్థిక సంవత్సరాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహించిన పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌పీలు పంచాయతీ వారీగా నివేదికలు చదివి వినిపించారు. పలు పంచాయతీల్లో చనిపోయిన వారి పేరిట వేతనాలు చెల్లించినట్లు, కొలతల్లో తేడాలు, పాస్ ఆర్డర్ లేకుండా బిల్లులు చెల్లించినట్లు ప్రజావేదికలో వెల్లడించారు. వీటిపై విచారణ జరపాలని ఏపీడీని డ్వామా పీడీ రామచంద్రరావు ఆదేశించారు. పణుకువలస పంచాయతీకి ఏర్పడి సుమారు మూడు సంవత్సరాలు గడుస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించలేదని సర్పంచ్ చీమల సావిత్రి పీడీకి ఫిర్యాదు చేశారు. కార్యక్రమానికి పలువురు మండల అధికారులు గైర్హాజరు కావడంపై పీడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీకాంత్, ఏపీడీ, పలువురు సర్పంచ్‌లు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే మండల అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీపీ బొంగు సురేష్

జియ్యమ్మవలస: సమష్టి కృషితోనే మండల అభివృద్ధి సాధ్యమని, ప్రజాప్రతినిధులు, అధికారులు మండల అభివృద్ధికి సహకరించాలని ఎంపీపీ బొంగు సురేష్ కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. తొలుత ఎంపీడీఓ ఎస్.రమేష్ ఒక్కో శాఖలో ఉన్న సమస్యలు, ఆ శాఖ ద్వారా జరిగిన అభివృద్ధి పనులు వివరించారు. రైతుల వద్ద ప్రస్తుతం 5 వేల టన్నుల వరకు ధాన్యం ఉందని, వాటిని ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఎంపీటీసీలు కోరగా, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కరిస్తానని ఏఓ సమాధానమిచ్చారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ అర్హులకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని సూచించారు. అభివృద్ధి పనుల్లో ఎక్కడా అవినీతి జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రతీ సోమవారం స్పందన కార్యక్రమం ద్వారా సచివాలయానికి అందే వినతులను పరిశీలించి, వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు మూడడ్ల శశికళ, వైస్ ఎంపీపీ జి.సంపత్‌కుమార్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి



మాట్లాడుతున్న డిప్యూటీ ఈఓ బ్రహ్మాజీ

సీతానగరం: జిల్లాలో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డిప్యూటీ ఈఓ బ్రహ్మాజీ అన్నారు. మండలంలోని ఆర్.వెంకంపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు నిర్వహిస్తున్న బోధనా తరగతులను, మన బడి నాడు – నేడు పథకం ద్వారా జరుగుతున్న అదనపు భవన నిర్మాణాలను పరిశీలించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ పదో తరగతి పబ్లిక్ పరీక్షల సమయంలో విద్యార్థులు సంయమనం పాటించి, జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఎంఈఓ జి.సూరిదేముడు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

23 మంది గైర్హాజరు

బాడంగి: స్థానిక గురుకుల పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు శనివారం 23 మంది గైర్హాజరైనట్లు ఎగ్జామ్స్ చీఫ్‌లు టి.రామదాసు, వి.శంకరరావు తెలిపారు. వారంతా ఇంటర్మీడియట్ మొదటి ఏడాది ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా, అనివార్య కారణాల వల్ల హాజరుకాలేనట్లు తెలిపారు.

పూర్తయిన రహదారుల పనులు



చినంకలాం జంక్షన్ నుండి శివరాంపురం గ్రామానికి వేసిన బీటీ రోడ్డు

సీతానగరం: మండలంలోని పలు గ్రామాలకు అనుసంధానంగా ఉన్న మట్టి రోడ్లును ఎమ్మెల్యే అలజంగి జోగారావు చేసిన కృషి ఫలితంగా బీటీ రోడ్లుగా అభివృద్ధిపరిచారు. దీంతో ప్రజల రాకపోకల ఇబ్బందులు తొలగాయి. పూర్తయిన రోడ్డు పనులను పీఆర్(ప్రాజెక్ట్స్) ఏఈ సంతోషి శనివారం పరిశీలించారు. సీతానగరం – బలిజిపేట మండలాల ప్రజల రాకపోకలకు అనుకూలంగా ఉండే విధంగా గ్రావెల్ రోడ్లును బీటీ రోడ్లుగా అభివృద్ధి పర్చినట్లు తెలిపారు. బొబ్బిలి నుండి కలవరాయి సీతానగరం మండలం గాదెలవలస మీదుగా పణుకువలస బీటీరోడ్డును అనుసంధానంగా ఉన్న బలిజిపేట మండలం శివరాంపురం వరకూ 620 మీటర్లు గ్రావెల్ రోడ్డును రూ.65 లక్షల వ్యయంతో వేయడంతో ప్రజలకు రాకపోకల కష్టాలు తీరాయని అన్నారు. పణుకువలస జంక్షన్ నుండి సీతానగరం మండలం చినంకలాం గ్రామానికి గల 1270 మీటర్లు మెటల్ రోడ్డును అభివృద్ధి పరుస్తూ రూ 1.07 కోట్లతో బీటీ రోడ్డు వేయడం జరిగిందన్నారు. దశాబ్దాల కాలంగా రాకపోకలకు పడుతున్న ఇబ్బందులు ప్రజలకు తొలగిపోయాయని అన్నారు. ఇక ప్రయాణికులు సాఫీగా ప్రయాణించవచ్చన్నారు.



చినంకలాం గ్రామానికి వేసిన బీటీ రోడ్డు

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జియ్యమ్మవలస: మండలంలోని వెంకటరాజపురం, మరువాడ, వనజ, పందులవానివలస, బిత్రపాడు గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీఓ రాజ్యలక్ష్మి ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. అర్హులైన వారంతా ఈ నెల 28వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు కురుపాంలోని ఐసీడీఎస్ కార్యాలయానికి దరఖాస్తులు అందజేయాలని కోరారు.

విద్యుత్ షాక్‌తో ఒకరికి గాయాలు

సీతంపేట: విద్యుత్ షాక్‌కు గురైన చంటి అనే వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికంగా నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులు చేస్తున్న ఆయన శనివారం ఉదయం వాష్ రూమ్‌కు వెళ్తుండగా, అక్కడి జారిపడిన విద్యుత్ వైరు అతడికి కాలికి తగులుకుంది. దీంతో అతడు షాక్‌కు గురై, గాయపడగా చికిత్స నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆస్పత్రిలో వైద్యసేవలు పొందుతున్న చంటి కోలుకుంటున్నట్లు సమాచారం.

విద్యార్థిని అదృశ్యంపై ఆరా



విద్యార్థిని అదృశ్యంపై ఆరాతీస్తున్న ఎంఈఓ నాగభూషణరావు

గరుగుబిల్లి: మండలంలోని రావివలస కేజీబీవీలో చదువుతున్న ఓ విద్యార్థిని అదృశ్యంపై ఎంఈఓ ఎన్.నాగభూషణరావు ఆరా తీశారు. శనివారం కేజీబీవీకి చేరుకున్న ఆయన అక్కడి ఆమె స్నేహితులు, సెక్యూరిటీ, సిబ్బందితో మాట్లాడి, వివరాలు సేకరించారు. విద్యార్థుల చదువుతో పాటు వారి క్రమశిక్షణ, నడవడికపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. ఏ విద్యార్థి ప్రవర్తనలో తేడా వచ్చినా సంబంధిత తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు.

వాహనాల వేలంతో రూ.56,994 ఆదాయం

వీరఘట్టం: స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో డీఎస్పీ జి.వి.కృష్ణారావు ఆధ్వర్యంలో వాహనాల వేలంపాట శనివారం నిర్వహించారు. ఓ ఆటో, మూడు ద్విచక్ర వాహనాలను పాటదారులు 18 శాతం జీఎస్టీతో కలిపి రూ. 56,994కు సొంతం చేసుకున్నారు. కార్యక్రమంలో పాలకొండ సీఐ మురళీధర్, దోనుబాయి ఎస్‌ఐ కిశోర్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

భూసర్వేకు రైతులు సహకరించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ ఎన్వీ రమణ

సీతానగరం: ప్రభుత్వం ప్రతిష్టాకరంగా అమలు చేస్తున్న జగనన్న సమగ్ర భూ సర్వే, భూ హక్కు పథకాన్ని రైతులు వినియోగించుకోవాలని తహసీల్దార్ ఎన్వీ రమణ అన్నారు. రామవరంలో రైతులతో భూ హక్కు, భూ రక్ష పథకం అమలుపై భూ రక్ష, భూ హక్కు పథకం అమలు డీటీ పి.చిట్టమ్మ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు శనివారం జరిగింది. ఈ మేరకు తహసీల్దార్ ఎన్వీ రమణ మాట్లాడుతూ మండలంలోని భూసర్వే పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. రెవెన్యూ రికార్డుల్లో తప్పులున్నట్లు గుర్తించిన రైతులు తమ అభ్యంతరాలను లిఖిత పూర్వకంగా తహసీల్దార్ పేరున మండల భూసర్వే డిప్యూటీ తహసీల్దార్ లేదా మండల సర్వేయర్‌కు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.సత్యం, మండల సర్వేయర్ శంకరరావు, సచివాలయ సర్వేయర్, వైఎస్సార్‌సీపీ నాయకులు పి.సూర్యనారాయణ, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

వేగవంతంగా అభివృద్ధి పనులు

పాచిపెంట: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన వినతుల మేరకు మంజూరైన అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎంపీడీఓ లక్ష్మీకాంత్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల ఇంజినీరింగ్ అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులతో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మెత్తం 118 పనులు మంజూరయ్యాయన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుని సకాలంలో పనులు పూర్తి చేసేలా ఇంజినీరింగ్ సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. పనులు పూర్తయిన వెంటనే బిల్లులు ఆన్‌లైన్ చేయాలన్నారు.

కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి పాచిపెంట వీరంనాయుడు, వైస్ ఎంపీపీ కొరిపల్లి రవింద్రనాథ్, మండల పార్టీ అధ్యక్షుడు గొట్టాపుముత్యాలనాయుడు, పీర్ ఏఈ వరలక్ష్మీ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

28, 31 తేదీల్లో వైఎస్సార్ ఆసరా కార్యక్రమాలు

- ఎమ్మెల్యే జోగారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం నియోజకవర్గ పరిధిలో మార్చి 28, 31వ తేదీలలో వైఎస్సార్ ఆసరా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండల స్థాయి, పురపాలక సంఘం రెండు వేర్వేరు ప్రాంతాల్లో శనివారం నిర్వహించిన ఆసరా సమావేశాలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 28వ తేదీన పార్వతీపురం మండలం, అర్బన్‌కు సంబంధించి 31వ తేదీన పురపాలక సంఘం పరిధిలో వైఎస్సార్ ఆసరా మూడో విడత కార్యక్రమం సమావేశాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో లబ్ధిదారులు అందరూ పాల్గొనేలా చూడాలని ప్రభుత్వం చేస్తున్న మేలును ప్రతి ఒక్కరికి తెలిసేలా ఈ కార్యక్రమాలను అత్యంత విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్వతీపురం మండలం జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, ఎంపీపీ మజ్జి శోభారాణి, మండల పార్టీ అధ్యక్షుడు బొమ్మి రమేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్‌పర్సన్ కొండపల్లి రుక్మిణి, వైస్ చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు, కౌన్సిలర్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తీరిన రహదారి కష్టాలు



రహదారి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని బైపాస్ ఫ్లైఓవర్ వంతెన రోడ్డు ఎట్టకేలకు మరమ్మతులు పూర్తి చేసుకుంది. ఇటీవల ఈ మార్గంలో పలు రోడ్డు ప్రమాదాలు జరగడంతో ఎమ్మెల్యే అలజంగి జోగారావు దీనిపై ప్రత్యేక దృష్టి సారించారు. సంబంధిత ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులతో సమస్య పరిష్కారంపై ఇటీవల చర్చించారు. అనంతరం తక్షణమే రహదారి మరమ్మతులు పూర్తి చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. దీంతో ఆర్‌అండ్‌బీ అధికారులు ఫ్లైఓవర్ వంతెన రహదారిపై గల గుంతలను బీటీతో పూడ్చి మరమ్మతులు పూర్తి చేశారు. ఈ క్రమంలో రహదారిని ఎమ్మెల్యే జోగారావు అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. ఫ్లైఓవర్ వంతెన మూడు వైపులా గల రహదారుల్లో ఎటువంటి గుంతలు లేకుండా నిర్మాణం పూర్తి చేయాలని, ప్రమాద హెచ్చరిక బోర్డులు అవసరమైన చోట ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

మరమ్మతులు పూర్తికి చర్యలు తీసుకున్న ఎమ్మెల్యేకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ బి.గౌరీశ్వరి, వైస్ చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు, ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు ఈఈ, డీఈ, వార్డు కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు వెంట పాల్గొన్నారు.

సక్రమంగా సామాజిక తనిఖీలు

సంతకవిటి: మండలంలో గతేడాదిలో చేపట్టిన ఉపాధి పనులకు సంబంధించిన సామాజిక తనిఖీలు సక్రమంగా చేపట్టాలని ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి సామాజిక తనిఖీల బృందానికి సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ బృందాలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2021 ఏప్రిల్ నుంచి 2022 మార్చి 31 వరకు జరిగిన ఉపాధి పనులపై సోషల్ ఆడిట్ ఉంటుందన్నారు. రూ. 12.84 కోట్ల వేతన అమౌంట్‌తో పాటు రూ. 5.99 కోట్ల మెటీరియల్ పనులపై ఆడిట్ చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌పీ మధులత, ఏపీఓ త్రినాథరావు, డీఆర్‌పీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలో నో యాక్సిడెంట్ డే



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ నీలకంఠం

పార్వతీపురం టౌన్: ప్రతీ ఒక్కరూ విధిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలని ట్రాఫిక్ ఎస్‌ఐ పాపారావు అన్నారు. శనివారం పట్టణంలోని పాత బస్టాండ్ కూడలి వద్ద నో యాక్సిడెంట్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహన చోదకులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిపై రోడ్డు భద్రతా, రక్షణ, అతి వేగం వంటి విషయాలపై సంకేత బోర్డులతో అవగాహన కల్పించారు. సరుకు రవాణా వాహనాలలో ప్రజా రవాణా చేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది కిషోర్, సంవత్, ఆటో డ్రైవర్‌లు, వాహన చోదకులు పాల్గొన్నారు.

ప్రజా సహకారంతోనే ప్రమాదాల నివారణ



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ నీలకంఠం

సీతానగరం: రాష్ట్ర రహదారిలో చినబోగిలి – సీతానగరం గ్రామాల మధ్య ఎస్‌ఐ కె.నీలకంఠం ఆధ్వర్యంలో సిబ్బంది వాహనాలను శనివారం తనిఖీ చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు వాహన చోదకులు సహకరించాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.